

# పుస్తక పరిచయం




**రచయిత, చిత్రకారుడు** సంజీవదేవ్‌గారి గురించి తెలుగు సాహితీప్రియులకు కొత్తగా పరిచయం చేయల్సిన అవసరం లేదు. ఆయన వ్రాసిన పుస్తకాలు, వేసిన చిత్రాలు రసహృదయులకు నిత్యవసంతాలు. సంజీవదేవ్‌గారిలోని మరో ప్రత్యేకత , అభిమానులకు అందరమైన ఉత్తరాలు వ్రాయడం. ఆధునిక తెలుగు సాహిత్యంలో లేఖల రచనలో ప్రముఖులు ఇద్దరు - చలం, సంజీవదేవ్. వారి నుంచి ఉత్తరాలు అందుకున్న అభిమానులు ఎందరో ఉన్నారు దశబ్దాల్లో. వీరు వ్రాసే ఉత్తరాలు , అందులోని అంశాలు, వివిధ సంఘటనలు, అభిప్రాయాలు సార్వజనీనమైనవి. 50, 60 ఏళ్ళ క్రిందటి ఉత్తరాలు (ఎవరికి వ్రాసినవైనా) ఇప్పుడు చదివినా రసహృదయం పులకరిస్తుంది, ఒక విధమైన ప్రశాంతతలో మునకలేస్తుంది. అందుకే ఈ ఉత్తరాలను లేఖాసాహిత్యం అంటారు. ఉత్తమ సాహిత్యానుకుండాల్సిన లక్షణాలన్నింటినీ పొదువుకున్న అక్షరమాలలు ఈ ఉత్తరాలు. సంజీవదేవ్‌గారు వ్రాసిన ఉత్తరాలకున్న మరో ప్రత్యేకత సందర్భానుసారం ఆయన జోడించిన ఆయన చిత్రించిన వాటర్ పెయింటింగ్స్ కూడా. అందుకే సంజీవ్‌దేవగారు తమకు వ్రాసిన ఉత్తరాలను చాలామంది పుస్తకాలుగా ప్రచురించారు. అందులో ఒకటే ఐనా ఈ సంకలనానికి ఇంకొక ప్రత్యేకత కూడా ఉంది. ఈ ఉత్తరాలను అందుకున్న వారు హరిహరప్రియ అనే కలంపేరుతో కన్నడభాషలో విశేషమైన సాహితీ సేవచేసిన సాతవల్లి వేంకట విశ్వనాథ భట్ట. వీరి మాతృభాష తెలుగు ఐనా, చదువుకున్నదీ, కృషిచేసిందీ అంతా కన్నడ సాహిత్యంలోనే. 10వ తరగతి వరకూ మాత్రమే చదివిన ఈయన ఈ రోజు హంపీ కన్నడ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి డిగ్రీలకు న్యాయనిర్ణేతగా ఉన్నారు. దాదాపు 40 పుస్తకాలు కన్నడంలో వ్రాశారు. తెలుగు - కన్నడ, కన్నడ - తెలుగు అనువాదాలు కూడా చేశారు. ఈ సంకలనంలో కేవలం సంజీవదేవ్‌గారు తనకు వ్రాసిన ఉత్తరాలనే చేర్చారు. ఈ ఉత్తరాలు కేవలం వ్యక్తిగత వివరాలతోనో, లేదా కేవలం వ్యాసాల లాగానో ఉండవు. అన్ని అంశాల కలబోత కాబట్టే ఈ ఉత్తరాలు ఎప్పుడు చదివినా తాజాగా ఉండడమే కాక, చాలాసార్లు సంజీవదేవ్‌గారు పాఠకులతో మాట్లాడుతున్నట్లే ఉంటుంది, ఏ ఉత్తరం చదివినా!

తంగిరాల వెంకట సుబ్బారావుగారు వ్రాసిన పాతికపేజీల సుదీర్ఘమైన ఉపోద్ఘాతం కూడా ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణను చేకూర్చింది. తెలుగు సాహితీ ప్రియులందరు చదివి, ఆనందించాల్సిన పుస్తకం ఈ లేఖమాల!

★★★

***Published by :***

పుస్తకమనె
702, బి.సి.సి.హెచ్.ఎస్ లేఔట్
వాజరహళ్ళి, తలఘట్టపుర
బెంగుళూరు - 560109
9242221506 / 9845867184 /




**ప్రభుత్వోద్యోగిగా** ఉన్నతపదవులలో ఉన్నప్పటికీ, సాహితీకృషిని నిర్లక్ష్యం చేయకుండా అవిశ్రాంతంగా చక్కటి కవితలు వ్రాస్తూ వస్తున్న సోమేపల్లి వెంకట సుబ్బయ్యగారి 7వ కవితాసంపుటి ఈ ' మట్టి పొరల్లోంచి..'. నానీల కవిగా కూడా తెలుగు కవితా ప్రియులకు సుపరిచితులు వెంకట సుబ్బయ్యగారు. ఈ పుస్తకంలో 30 పైగా కవితలున్నాయి. ప్రతి కవితలోనూ కవి యొక్క పదునైన ఆలోచన, నిశితమైన విశ్లేషణ, విలక్షణమైన వ్యక్తీకరణ స్పష్టంగా కనిపిస్తాయి. తీసుకున్న అంశాల్లో ఎంత వైవిధ్యం ఉందో. వ్యక్తపరచే ప్రక్రియల్లో ఎంచుకున్న పదచిత్రాలు కూడా వినూత్నంగా ధ్వనిస్తాయి. 'హరితానుబంధం', ' ఆత్మీయఛత్రం' లాంటి పదప్రయోగాలు ఈ కవి సొంత సంతకాలు. సరళమైన శైలి, ఎక్కడా ఇబ్బంది పెట్టని భావాలు, ఔచిత్యభంగంకాని వాక్యాలు - ఈ కవితా సంపుటిలోని ముఖ్యమైన లక్షణాలు. కవిత చదివి ముగించాక కూడా ఒక ముద్ర వేయడం కవిగా వెంకటసుబ్బయ్యగారు సాధించిన విజయం అనిచెప్పుకోవచ్చు. మొట్టమొదటి కవిత 'నాలో నేను' లో "మనసు మర కాదు / మమతల పొర .. దశాబ్దాల ప్రయాణం / శరీరపు వన్నె తగ్గించిందేమోకాని / మనోశ్వాస / కొత్త చిగుర్లై పల్లవిస్తూనే ఉంది / నేను నిరంతరం / ప్రవహించే మనిషినే!" అంటారు. 'ఎక్కడ వెదకడం' అనే కవితలో మాయమౌతున్న మనిషితనానికి దిగులు పడుతూ చివరలో "అయితే ఇప్పుడు / మనిషిని వెతకాలి / బయటకాదు / మనిషిలోనే వెతకాలి" అని స్పష్టీకరిస్తారు. 'పాదునీడ' లో " ఎడం ఎడంగా నాటిన మొక్కలు / ఏపుగా పెరిగి పెరిగి వృక్షాలై / కొమ్మలై రెమ్మలై కౌగిలించుకుంటాయి / తల్లీ బిడ్డల నడుమేమో / వయసు పెరిగే కొద్దీ / మమతల అల్లిక మృగ్యమౌతోంది!" అంటూ చక్కటి పోలిక చెప్పిన కవి 'ఉల్టా ఉగాది' అనే కవితలో "ఇప్పుడు ప్రపంచమొక మార్కెట్ / మనిషి / అందులో / అమ్మకపు సరుకు..!?" అంటారు. సమాజంలోని సమస్యలపట్ల చిత్తశుద్ధితో కూడిన ఆలోచన, చింత కనిపిస్తుంది. ముందుమాట వ్రాసిన ఆచార్య గోపిగారు "ప్రేమ తత్వం లేనివాడు, మానవత్వం వెదజల్లనివాడు గొప్పకవి కాలేడు. ఈ సంపుటిలో మనిషిపట్ల ఒక నమ్మకం, ఒక భరోసా, ఒక అనురాగం కనిపిస్తాయి. ఒక మంచి మనిషి లోంచే మంచికవిత్వం విర్భవిస్తుందనడానికి ఈ సంపుటిలోని ప్రతికవితా నిదర్శనంగా నిలుస్తుంది" అన్నారు. ఈ కవితలు చదివిన పాఠకులు గోపిగారి అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తారు. ★★★

**Writer:**

Somepalli Venkata Subbaiah
svsomepalli@gmail.com
Phone: 900 000 4565

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**